క్లుప్తంగా

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/తిరుమలాయపాలెం: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. తొలుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి కలెక్టరేట్‌లో జరిగే జిల్లాస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. ఆతర్వాత మధ్యాహ్నం 3–30గంటలకు తిరుమలాయపాలెం మండలం అజ్మీరాతండా పరిధి రాకాసితండాలో ఆకేరుపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి, చెక్‌డ్యాంను మంత్రి పొంగులేటి ప్రారంభిస్తారు. అనంతరం కూసుమంచి మండలం పోచారంలో గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించాక నాయకన్‌గూడెంలో గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసి, ఈశ్వరమాదారంలో హైలెవల్ బ్రిడ్జిని మంత్రి ప్రారంభించనున్నారు.

నేడు కరెంట్ కోత

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని టౌన్–2 సెక్షన్ రాపర్తినగర్ 33/11 కేవీ సబ్ స్టేషన్ టీఎన్జీఓస్ కాలనీ 11 కేవీ లైన్‌కు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా నేడు (బుధవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో టీఎన్జీఓస్ కాలనీ, బీసీ కాలనీ, గాయత్రీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

రేపు చేగొమ్మ నర్సరీలో వేలం

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ ఉద్యాన నర్సరీలో వెదురు, సరుగుడు చెట్ల విక్రయానికి ఈనెల 11వ తేదీన మరోమారు బహిరంగ వేలాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఉద్యాన అధికారి పి.అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీలోని 300 వెదురు, 500 సరుగుడు చెట్లు విక్రయానికి ఉన్నాయని, వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు దరావత్ చెల్లించాలని సూచించారు. వివరాలకు 89777 14104 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చెక్కులు అందజేత

ఖమ్మంక్రైం: జిల్లాలోని హోంగార్డు ఆఫీసర్స్‌కు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ చెక్కులు అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న హోంగార్డులకు, వారి కుమార్తెల వివాహల కోసం చెక్కులు మంజూరు కాగ ఆ చెక్కులను హోంగార్డు ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, ఉపేందర్, నవీన్, కోటేశ్వరరావు, కిషన్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, ఆర్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ సభ్యుడు ఆర్తి గోవిందరావు మనవడు పుట్టిన రోజు సందర్భంగా నగరంలోని జీవన సంధ్య వృద్ధాశ్రమంలో 60 మంది వృద్ధులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన పండ్లు, బ్రెడ్, స్వీట్స్ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు బొల్లికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి గెల్లా శ్రీరామ్, కోశాధికారి ఆర్తి గోవిందరావు, రీజియన్ చైర్మన్ డాక్టర్ డీపీ సీరావులతో పాటు నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

నేలకొండపల్లి: కుక్కల దాడిలో మండలంలోని ఐదుగురు గాయపడ్డారు. మండలంలోని రాయగూడెంకు చెందిన శ్రీను, శైలజ, గువ్వలగూడెంకు చెందిన అమరావతి, అప్పలనరసింహాపురానికి చెందిన కె.వెంకటేశ్వర్లు, నేలకొండపల్లికి చెందిన అనంతలక్ష్మిపై కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. వీరు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కామేపల్లి: మండలంలోని శ్రీరాంనగర్ పాఠశాలలో ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులుగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్తున్న జక్కుల వెంకటేశ్వర్లు, కేవీ రమణలను మంగళవారం పాఠశాలలో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ భూక్యా నంద, రాజేష్, రమేష్, బాబుసింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

ఖమ్మంలీగల్/ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన చట్టాలను రద్దుచేయాలనే డిమాండ్‌తో ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం ఏడో రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు వడ్డెల్లి కృష్ణమూర్తి, వంజాకు లక్ష్మీనారాయణ, చేకూరి ముక్తేశ్వర్‌రావు, రెంటాల ఆనంద్, కే.ఎస్.ఎం.రావు, చంద్రశేఖర్, నజీమా కూర్చున్నారు. కాగా, దీక్షలకు ఐఎంఏ బాధ్యులు యలమంచిలి రవీందర్‌నాథ్, హరిప్రసాద్, కొల్లి అనుదీప్, నారాయణ, కూరపాటి ప్రదీప్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పొట్ల మాధవరావు, జక్కంపూడి నాగేశ్వరావు, కొల్లి సత్యనారాయణ, బి.తిరుమలరావు, శేషగిరి, వై.శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, చింతనిప్పు వెంకట్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావుతో పాటు బానోతు బద్రూనాయక్, పుల్లూరు నాగయ్య, వెంకటాచారి కూడా దీక్షలకు మద్దతు తెలిపారు.

రోడ్లు సక్కగుంతల్లేవ్..!



సరిత క్లినిక్ సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న గుంత

అధ్వానంగా అంతర్గత రహదారులు

- రోడ్లపై గుంతలకు ప్యాచ్‌వర్క్‌లతోనే సరి
- నాణ్యతలేమితో మళ్లీ అదే పరిస్థితి
- మూన్నాళ్లకే ముచ్చటగా మరమ్మతులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- శాశ్వత పరిష్కారం చూపాలని పలువురి వేడుకలు



బస్టాండ్ బైటగేట్ రోడ్డులో ఏర్పడిన గుంత

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఎన్ఎస్‌పీ క్యాంపు, సరిత క్లినిక్ సెంటర్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో రోడ్లు నాణ్యత లేకపోవడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటికి ప్యాచ్‌వర్క్‌లు సక్రమంగా చేయకపోవడంతో గుంతలు పడడానికి ఎక్కువ కాలం పట్టడం లేదు.

తాత్కాలికంగా మరమ్మతులు..

ఎన్ఎస్‌పీ క్యాంపులో కొత్త బస్టాండ్ నిర్మించిన తర్వాత బస్టాండ్ బైటగేట్ వైపు సీసీ రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో రహదారి అంతా గుంతలమయంగా తయారైంది. తాత్కాలికంగా మరమ్మతులు చేసినా గుంతలు పడుతూనే ఉన్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా శాశ్వత పరిష్కారం చూపించేందుకు అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పైపులైన్లతో ఇంకాస్త గుంతలమయం..

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి సరితక్లినిక్ సెంటర్ వరకు నిర్మించిన రోడ్డు నాణ్యత లేకపోవడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ రోడ్డులో పైపులైన్ల కోసం గుంతలు తీయడంతో రోడ్డు ఇంకాస్త గుంతలమయంగా మారింది. నర్సింహస్వామి గుడి ముందు రోడ్డుపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ద్విచక్రవాహనదారులు ఈ గుంత దగ్గరకు వచ్చే వరకూ కనిపించకపోవడంతో ఒక్కసారిగా బ్రేక్ వేసి కింద పడుతున్నారు. ఇక సరితక్లినిక్ సెంటర్‌లో ఏర్పడిన గుంతల్లో వాహనాలను నడపలేక కొంచెం పక్కకు వాహనాన్ని నడిపినా ఎదురుగా వచ్చే వాహనాలు నిలిచిపోయి నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతుంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటికి మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు గుంతల్లో పడిన సందర్భాలు ఉన్నాయి.

నాణ్యత లేకుండానే..



ఎన్ఎస్‌టీ రోడ్డులో ప్యాచ్‌వర్క్ ఇలా..

అంతర్గత రోడ్లపై ఏర్పడే గుంతలను అధికారులు ప్యాచ్‌వర్క్‌ల ద్వారా మరమ్మతులు చేయిస్తున్నారు. ఒకసారి గుంత ఏర్పడితే దానికి శాశ్వత పరిష్కారం చూపించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొత్త బస్టాండ్ బైటగేట్ రోడ్డులో ఇప్పటి వరకు నాలుగైదు సార్లు రోడ్డుకు మరమ్మతులు చేసినా.. మళ్లీ మోకాలు లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇక ఎన్ఎస్‌టీ రోడ్డు పరిస్థితి అలానే ఉంది. దీంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారే నాణ్యతతో రోడ్లకు మరమ్మతులు చేయిస్తే గుంతలు ఎందుకు పడతాయని ప్రశ్నిస్తున్నారు.

అంచనాలు రూపొందిస్తున్నాం..

నగరంలోని అంతర్గత రహదారులపై ఏర్పడిన గుంతలను గుర్తిస్తున్నాం. రోడ్ల మరమ్మతులకు అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. ప్యాచ్‌వర్క్‌లు చేయించాల్సిన పలు రోడ్లను ఇప్పటికే గుర్తించాం. త్వరలోనే టెండర్లు పిలిచి రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం.

– కృష్ణాలాల్, ఈఈ, కేఎంసీ

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మం సహకారనగర్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, బీఈడీ, నర్సింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘాల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధికి కావాల్సిన రోడ్లు, ప్రాజెక్ట్‌లు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఎన్నికల సమయాన ఇచ్చిన వాగ్దానం మేరకు గోదావరి జలాలను జిల్లా పొలాలకు తీసుకొస్తానన్నారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి లేరని, అయినా లోటు లేకుండా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు లెవనెత్తిన అంశాలను పరిష్కరించేలా చూస్తానని హామీ నిచ్చారు. ఫేమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో స్కూల్ మేనేజ్‌మెంట్ బాధ్యులు ఐవీ రమణారావు, కాంతారావు, నాయుడు వెంకటేశ్వరరావు, నాసరయ్య, వీరన్న, శశిధర్, సాంబశివారెడ్డి, ప్రసాద్, రవిమారుత్, కళాశాలల అసోసియేషన్ బాధ్యులు ఎం.వీరారెడ్డి, కె.నవీన్, ప్రభాకర్‌రెడ్డి, శేషగిరి, మధు, లింగారెడ్డి, చౌదరి, గ్రంధి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల బాధ్యులు

ఎస్‌ఐ ఆత్మహత్యపై విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

ఖమ్మంరూరల్: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న దళిత ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని ఎంవెంకటాయపాలెం గ్రామంలో ఎస్‌ఐ ఆత్మహత్యకు కారకులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యాన నిరసన తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు.కులం, మతం పేరుతో సాటి ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఎ.వరకుమార్, కె.రాంబాబు, రామయ్య, నాగేశ్వరరావు, వి.పవన్‌కుమార్, పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం బోదులబండ ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి ఎ.బిందు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ పుట్టకుండా.. కుట్టకుండా నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ కర్నాటి వాణి, ఎంపీహెచ్ఏ వి.పద్మావతి, పంచాయతీ కార్యదర్శి బోళ్ల వీరబాబు, సెకండ్ ఏఎన్ఎం ఆబేదా, ఆశా కార్యకర్త చెరుకుపల్లి బేబి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమత ఆస్పత్రి రోడ్డులో ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న గరిడేపల్లి మహేష్ గత మే 29న ఇంటి నుంచి దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో తల్లి లక్ష్మి మంగళవారం ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మత్తుకు బానిస కావొద్దు

నేలకొండపల్లి: యువత చెడు వ్యసనాలకు బానిసకావొద్దని ఎస్సై తోట నాగరాజు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం యూత్‌కు కౌన్సెలింగ్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు వాడకం, జూదం ఆడటం వంటివి జీవితాలను నాశనం చేస్తాయని పేర్కొన్నారు.

రైతు రుణ విమోచన చట్టం తేవాలి

కూసుమంచి: రైతులకు రుణ విమోచన చట్టాన్ని తీసుకొచ్చి ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బజ్జూరి వెంకట్రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కూసుమంచిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అతివృష్టి, అనావృష్టితో పాటు పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడాల్సి వస్తుందన్నారు. ఈనేపథ్యాన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మాతంగి రామస్వామి, చెరకుపల్లి వీరయ్య, నాగయ్య, ఉప్పలయ్య, వెంకటయ్య, సుదర్శన్, అప్పారావు, వీరస్వామి, రంగారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: గుర్తింపు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థులు కలెక్టరేట్ గేటు బయట నిరసన తెలుపుతూ ఆందోళన చేశారు. సంఘ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సభలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ.. అడ్మిషన్ ముసుగులో ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజుల మోత మోగిస్తున్నా.. జిల్లా విద్యాశాఖ అధికారి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 25% ఫీజు రాయితీ ఇవ్వాలన్నారు. అలాగే జర్నలిస్ట్ పిల్లలకు 50% ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు లోకేష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగులమీర, సహాయ కార్యదర్శి శివ నాయక్, కౌశిక్, గౌతమ్, జిల్లా నాయకులు రాకేష్, ప్రతాప్, ప్రభాస్, రోహిత్, రాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

నేలకొండపల్లి/ కూసుమంచి/ తిరుమలాయపాలెం / ఖమ్మంమయూరిసెంటర్: పంచాయతీలలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ ఎం.యర్రయ్య, కూసుమంచి ఏడీఏ విజయచంద్ర సూచించారు. మంగళవారం నేలకొండపల్లి మండలంలోని చెన్నారం పంచాయతీలలో ప్లాంటేషన్ నిర్వహణను పరిశీలించిన సందర్భంగా యర్రయ్య, కూసుమంచిలోని రైతు వేదికలో మొక్కలు నాటిన సందర్భంగా విజయచంద్ర మాట్లాడారు. ప్రతీ పంచాయతీలో ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేలా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా ఖమ్మం నగరంలోని 28వ డివిజన్ ప్రకాష్‌నగర్ చిన్న మున్నేరు వద్ద ఉన్న వైకుంఠధామంలో కాటికాపరి జాంబవంతుడు సొసైటీ అధ్యక్షుడు చేరుకుపల్లి బాలు ఆధ్వర్యాన మొక్కలు నాటారు. అంతేకాక తిరుమలాయపాలెం మండలంలోని జల్లెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ధారా రాజేష్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో చెన్నారం పంచాయతీ కార్యదర్శి నరేష్, కాటికాపరులు పంది వేణు, కె.సైదులు, పడిశాల వీరస్వామి, గట్టికొండ చుక్కయ్య, కె.కాశయ్య, సీతారాములు, కోటయ్య, ఏఓలు వాణి, అరుణకుమారి, సీతరాంరెడ్డి, నాగేశ్వరరావు ,ఏఈఓలు పాల్గొన్నారు.



నేలకొండపల్లి: చెన్నారం నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

వినతుల వెల్లువ..

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి..



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌పీటీఏ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరుతూ తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(టీఎస్‌పీటీఏ) బాధ్యులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ మాట్లాడుతూ.. 10వేల హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని, పాఠశాలల పనివేళలను పాత విధానంలో కొనసాగించాలని పలు సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు మంగ, సుధారాణి, రామలింగం తదితరులున్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లాలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని జిల్లా కాంగ్రెస్ దివ్యాంగుల సంఘం కోరింది. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ దివ్యాంగుల అధ్యక్షుడు కుంచం ఉప్పలయ్య ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రాఘురాంరెడ్డికి మొక్క అందజేసి వినతిపత్రం సమర్పించారు. రెండేళ్లుగా తుప్పపట్టిపోతున్న స్కూటీలను లిస్టులో ఉన్నవారికి అందించాలని, మూడేళ్లుగా డ్రా తీయని రుణాలను వెంటనే డ్రా తీసి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరికంటి నాగేశ్వరావు, కోటి, సుకన్య, జంగిలి శ్రీను, సుమన్, జానీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని బైపాస్ రోడ్డుకు ఇరువైపుల అక్రమ నిర్మాణాలు చేపడతున్నారని, వెంటనే వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ కేఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యాన కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. నూతన బస్టాండ్ రాకతో ఏ భవనం కనీస నిబంధనలు పాటించడం లేదన్నారు. కనీసం సెట్‌బ్యాక్ లేకుండా, భద్రతా పరంగా చర్యలు తీసుకోకుండా భవనాలు కడుతున్నా.. అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. భవిష్యత్ అభివృద్ధి, ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు జె.వెంకన్న బాబు, భద్రం, నాగేశ్వరరావు, కృష్ణ, గుమ్మడి భిక్షం, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల గోదాంతో ఇబ్బంది..

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఉన్న ఎరువుల గోదాంతో తాము ఇబ్బంది పడుతున్నామని ఆ ప్రాంత ప్రజలు మంగళవారం ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు. కూసుమంచి రోడ్డులోని తమ ఇంటి సందులో గోదాం ఏర్పాటు చేయడంతో వాహనాలు రాకపోకలు, ఎరువుల వాసనతో అవస్థలు పడుతున్నామని నంచర్ల దేవీప్రసాద్ ఎంపీడీఓకు వివరించారు.

రేషన్ కార్డులు ఇవ్వాలి..

తిరుమలాయపాలెం: అర్హులైన పేదలకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ధరణిలో దరఖాస్తు చేసుకున్న అందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యాన తహసీల్దార్ పీవీ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ.. సాదా బైనామా కింద దరఖాస్తు చేసుకున్న వారికి పాస్ పుస్తకాలు ఇవ్వాలని, ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని, ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలలో తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో త్వరగా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తుళ్లూరు నాగేశ్వరావు కన్నెగంటి నారాయణ, లాలయ్య, వెంకటనరసయ్య, యశోద, నాగేశ్వరరావు వెంకన్న, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి..

కూసుమంచి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. వానాకాల సీజన్ ప్రారంభమైనందున రైతులకు భరోసా అందించాలని, ఏకకాలంలో రుణమాఫీ చేయాలని, రైతు కూలీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. హామీలు అమలు చేయకపోతే పార్టీ ఆధ్వర్యాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కొత్తా శ్రీనివాసరెడ్డి, నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి, బెల్లం మురళి, గడ్డం వెంకటేశ్వర్లు, ప్రభాకర్, నరేష్, వెంకన్న, వెంకటరెడ్డి, మహేందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ అవకతవకలపై విచారణ

కామేపల్లి: మండలంలోని బర్లగూడెం గ్రామంలో ఈజీఎస్ పనుల్లో జరిగిన అవకతవకలపై అధికారులు రెండో రోజు రికార్డుల పరిశీలనతో పాటు విచారణ కొనసాగింది. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఈజీఎస్‌లో పని చేసి తమ ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఏపీఓ శ్రీరాణి స్థానిక ముగ్గురు సీనియర్ మేట్లు ద్వారా విచారణ చేపట్టి వివరాలను లిఖిత పూర్వకంగా సేకరించి అదనపు డీఆర్‌డీఓ బి.శిరీషకు అందజేశారు. మస్టర్లలో ప్రభుత్వ ఉద్యోగులమంటూ పలువురు పేర్లను అందించడంతో విచారించగా.. తామెవరూ ఉద్యోగులం కామనివ్యవసాయ కూలీలమని చెప్పారు. కూలీల నుంచి డబ్బులు వసూలు విషయంపై కూడా అధికారులు క్షుణ్ణంగా విచారణ చేపడుతున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

జీపీ కార్యాలయం ఎదుట ఆందోళన..

బర్లగూడెం జీపీ కార్యాలయం ఎదుట పలువురు ఈజీఎస్ కూలీలు ఆందోళన చేశారు. తాము ప్రభుత్వ ఉద్యోగులమని అధికారులకు కావాలనే తప్పుడు ఫిర్యాదు చేశారని, తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యువశక్తిని వినియోగించుకోవాలి

ఖమ్మంరూరల్: దేశంలోని యువశక్తిని పాలకులు సద్వినియోగం చేసుకోవాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రేమ్‌సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎంవెంకటాయపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి యువత మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. యువతలో పెడధోరణులు తొలగింపచేసి, ప్రశ్నించే చైతన్యాన్ని తేవడం, దేశభక్తిని పెంపొందించడంలో పీవైఎల్ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోకల సంపత్, టి.రజేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలకు నాణ్యమైన బియ్యాన్ని అందించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి హరీశ్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పురుగుల అన్నం, నీళ్లచారుతో వడ్డిస్తున్నారన్నారు. పాఠశాలలు, హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు మౌలానా, అరవింద్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'సీత్లా' సంబరాలు

గిరిజనుల ఆరాధ్యదైవమైన సీత్లా భవానీ పండుగ (దాటుడు పండుగ)ను మంగళవారం పలు తండాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులంతా కలిసి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తరలివెళ్లి గ్రామ శివారులోని గ్రామ దేవతలకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పశువులకు రంగులు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కామేపల్లి: గోవింద్రాలలో పూజలు చేస్తున్న గిరిజనులు



తిరుమలాయపాలెం: గోల్‌తండాలో మొక్కులు చెల్లించేందుకు వెళ్తున్న మహిళలు



రఘునాథపాలెం: కొర్లబోడుతండా ఊరేగింపులో గిరిజనుల సంబరాలు



కూసుమంచి: పాలేరు సీత్లా వేడుకలో పాల్గొన్న గిరిజనులు